## ఉత్సవాలు ఐక్యతను పెంపొందించాలి




ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 05 | ఏప్రిల్ | 2024
పేజీలు 7

# జవాబుదారీతనంతో పాలన



**-సుస్థిర ప్రభుత్వం కోసమే ఎంఎల్‌ఎలను చేర్చుకుంటున్నాం**
**-దేశానికి తెలంగాణ మోడల్**
**-మీడియా సమావేశంలో మల్లు భట్టివిక్రమార్క**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలో కేసిఆర్ మాదిరి ఇష్టానుసారంగా పాలన చేయడం లేదని జవాబుదారి తనంతో పని చేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ముఖ్యమంత్రి నుంచి సహచర మంత్రులందరూ వారి వారి శాఖలకు సంబంధించి నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ పురోగతి సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుండి ఈ ప్రభుత్వాన్ని కూల్చేస్తాం, పడగొడతామంటూ బిఆర్‌ఎస్, బిజెపి నేతలు మాట్లాడుతున్నారని ప్రభుత్వం పటిష్టంగా ఉంటే ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే విధంగా నిర్ణయాలు తీసుకోవచ్చునన్న ప్రజాస్వామ్య స్ఫూర్తికి లోబడి బిఆర్‌ఎస్ లేదా ఇతర పార్టీల నుంచి ప్రజా ప్రతినిధులను పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వం బలంగా ఉంటే పాలన పారదర్శకంగా సాగుతుందని అందు కోసమే ఇతరులు పార్టీలో చేరతానని వస్తున్నప్పుడు చేర్చుకుంటున్నామన్నారు. కేసిఆర్ మాదిరి ఇతర పార్టీలను బలహీనపర్చడం ద్వారా లబ్ది పొందాలని కాంగ్రెస్ పార్టీ భావించడం లేదని విక్రమార్క స్పష్టం చేశారు. కేసిఆర్ విమర్శలకు అర్థం పర్థం లేదని ముఖ్యమంత్రి కానీ తాను లేదా ఇతర మంత్రులు ఢిల్లీ వెళ్లినప్పుడు రాష్ట్రానికి కావాల్సిన ప్రాజెక్టులు మంజూరు చేయిస్తున్నామని నిధులు సాధిస్తున్నామని కేసిఆర్ మాదిరి ఢిల్లీ వెళ్లి బీహార్ లేదా ఇతర రాజకీయ పార్టీల నేతలతో తాము మాట్లాడలేదని ఆయన తెలిపారు.

మిగతా 2లో..

## దేశం తెలంగాణ వైపు చూస్తుంది



**-సిగ్గులేకుండా మాట్లాడుతున్న బిఆర్‌ఎస్ నేతలు**
**-అప్పులను తీరుస్తూ సంక్షేమం అందిస్తున్నాం**
**-రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** దేశం తెలంగాణ వైపు చూస్తున్నదని మూడు నెలల కాలంలో చేసిన కార్యక్రమాలు దేశం మొత్తం చూసేలా ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు రుణమాఫీ చేయకుండా ఇప్పుడు బిఆర్‌ఎస్ నేతలు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని ఆయన తెలిపారు. గురువారం ఖమ్మంలో జరిగిన నియోజక వర్గ కార్యకర్తల సమావేశంలో తుమ్మల మాట్లాడుతూ అవినీతి, కబ్జాలతో, పోలీసుల సహాయాంతో తిరిగి అధికారంలోకి వస్తామని ప్రజలను కాంగ్రెస్ కార్యకర్తలను హింసించి భయపెట్టారన్నారు. ప్రజల శక్తియుక్తుల ముందు వారి ఆశలు పటాపంచాలయ్యాయన్నారు. సోనియా గాంధీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తుమ్మల తెలిపారు. బిఆర్‌ఎస్ చేసిన అప్పులకు ఒక పక్క వడ్డీలు చెల్లిస్తూనే సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. 125 రోజుల కాంగ్రెస్ పాలన వైపు దేశం చూస్తుందని అందుకే దేశం మొత్తం కూడా తెలంగాణ గ్యారెంటీలను అమలు చేయాలని పార్టీ భావిస్తుందన్నారు. శనివారం తుక్కుగూడలో జరిగే సభలో రాహుల్ గాంధీ,

మిగతా 2లో..

## ఉపాధి హామీపై పట్టింపేదీ..!?

**ఉద్యోగం ఓ చోట.. నివాసం మరోచోట**



**ప్రజాపక్షం/కరకగూడెం:** ఎప్పుడు వచ్చామన్నాది కాదు.. వచ్చిన రోజే రాని రోజుల సంతకాలు పెట్టామా లేదా పంచాయితీలో సమస్యలు ఎలా ఉంటే మాకేం వేతనం అందిందా లేదా అనేది ముఖ్య మంటు అంటున్న కొందరు పంచాయితీ కార్యదర్శుల పని తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం పంచాయితీ కార్యాలయాలకు వెళ్లిన తమకు కార్యదర్శులు సమయానికి రావడం లేదని, వచ్చిన కూడా వచ్చామా వెళ్లామా అన్నట్లు మరి కొందరు రెండు, మూడు రోజులు రాకున్న వచ్చినట్లే అన్నట్లు వచ్చిన రోజే రిజిస్టర్లో సంతకాలు పెట్టుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వూరకే వచ్చి సంతకాలు పెట్టి వెళ్లిపోవడం, పంచాయతీలో ఏం జరిగినా కూడా పట్టించుకోకపోవడం కొంత మంది కార్యదర్శుల పనితీరుగా మారింది. ఉపాధి హామీ పథకం దగ్గరికి వెళ్లి ఏం జరుగుతుందో అని కూడా చూడని

మిగతా 2లో..

# జవాబుదారీతనంతో పాలన

(మొదటిపేజీ తరువాయి)
రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని తాము భావిస్తున్నామని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రక్షణ భూమికి సంబంధించి అనుమతులు సాధించామని రిజనల్ రింగు రోడ్డుకు అనుమతులు సాధించడంతో పాటు నిధులు ఖర్చు చేసేవిధంగా అనుమతి పొందామని రిజనల్ రింగు రోడ్డు ఖర్చు కేంద్రమే భరించేవి ధంగా ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు. కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి అంటూ కేసీఆర్ మాట్లాడడంలో అర్థం లేదని ఏ ప్రాజెక్టును ఆయన పూర్తి చేయక పోగా నిర్మాణ వ్యయం విపరీతంగా పెరిగిందని యాదాద్రి పవర్ ప్రాజెక్టు ఒక్కసారిగా రూ. 24 వేల కోట్ల నుంచి రూ. 35 వేల కోట్లకు పెరిగిందని ఆయన తెలిపారు. ప్రపంచం మొత్తం ఆధునీక పద్ధతులను అనుసరిస్తుంటే కేసీఆర్ పురాతన పద్ధతిని ఆలోచించి రాష్ట్రం పై భారం మోపారని ముడి పదార్థాలు దొరికే చోట కాకుండా ఇష్టానుసారంగా ప్రాజెక్టుల నిర్మాణం జరగడం వల్ల ట్రాన్స్‌పోర్టు భారం రాష్ట్రం పై పడుతుందన్నారు. భద్రాద్రి ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ అనుమతులే తీసుకోలేని కేసీఆర్ మూడు నెలల కాంగ్రెస్ పాలనను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. తనకు ఇష్టమైన ఒకట్రెండు శాఖలపై మాత్రమే రివ్యూ చేసేవాడని ఇది రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. తుక్కుగూడ బహిరంగ సభ ద్వారా తెలంగాణ మోడల్‌ను దేశానికి పరిచయం చేయనున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో ఎన్నికల సందర్భంగా ఆరు గ్యారెంటీలపై హామీ ఇచ్చామని వాటిని నెరవేర్చామని మూడు నెలల్లో 30వేల ఉద్యోగాలు ఇచ్చామని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశంలో కూడా హామీల అమలు, ఉపాధి వనరులు తదితర విషయాల ద్వారా లబ్ధి పొందవచ్చునని భట్టి తెలిపారు. ఖమ్మం జిల్లా ప్రజలు పది స్థానాల్లో తొమ్మిదింటిలో కాంగ్రెస్‌ను గెలిపించారని మరో సారి పార్లమెంటు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆర్థిక, సహజ, మానవ వనరులను ఉపయోగించుకుని రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తామన్నారు. కరువు కాంగ్రెస్ పార్టీ తెచ్చింది కాదని డిసెంబరు అధికారంలో చేపట్టినప్పుడు రాష్ట్రంలో పరిస్థితి ఏమిటో రాష్ట్ర ప్రజలకు తెలుసునని ప్రాజెక్టులలో చుక్కనీరు లేదని ఇప్పుడు తాగునీరు, సాగు నీటి ఎద్దడికి కాంగ్రెస్ పార్టీ కారణం కాదని ఆ పాపం బిఆర్ఎస్ దేనన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమని రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రంలో 12 నుంచి 14 పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించబోతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, మహ్మద్ జావిద్, డిసిసిబిఅధ్యక్షులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీపై పట్టింపేదీ..!?

(మొదటిపేజీ తరువాయి)
పరిస్థితిలో ఉన్నారు. కలెక్టర్, ఎంపీడీవో ఉపాధి హామీ కూలీలకు మంచి నీరు, ఓఆర్ఎస్, ఫస్ట్ ఎయిడ్ కిట్, టెంటు సౌకర్యాలు కల్పించాలని సూచించినా కూడా సదరు సెక్రెటరీలు, కూలీలకు కనీసం సౌకర్యాలు కల్పించడం లేదని, పట్టించుకోవడంలేదని కూలీలు వాపోతున్నారు. మండలెండలో పనిచేస్తున్న ఉపాధి పనులు. సెక్రెటరీలు వచ్చి సూచనలు ఇచ్చిన దాఖలాలే లేవని కూలీలు తెలుపుతున్నారు. అసలు ప్రభుత్వ నియమాల ప్రకారం ఉదయం 9 గంటలకు కార్యాయలంలో ఉండాలి, కానీ అందుకు విరుద్ధంగా ఇక్కడి కార్యదర్శుల కొంతమంది తీరు సపరేటుగా ఉంటుందంటున్నారు. ఆఫీస్ కి ఎప్పుడు వస్తారో తెలియదు.. ఎప్పుడు వెళ్తారో కూడా తెలియదు.. స్థానికంగా సైతం నివాసం ఉండాలని జిల్లా కలెక్టరు పలు మార్లు సమావేశాల్లో చెప్పుతున్నప్పటికి ఆ మాటలను సైతం పట్టించుకోకుండా దూర ప్రాంతాల నుండి విధులను నిర్వహిస్తున్నారనే అపవాదు కార్యదర్శులు ముట్టగట్టుకుంటున్నారు. స్థానికంగా పంచాయితీ కార్యదర్శులు ఉండక పోవడంతో సమస్యల పై పూర్తి స్థాయిలో అవగాహన లేక, స్థానికంగా ఉండే షాడో కార్యదర్శుల మాటలను వింటున్నారనే ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. పంచాయితీ కార్యదర్శులు తీరు ఇలా ఉంటే మరీ మండల ప్రజాపరిషత్ అధికారులు సైతం వారికి వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అధికారులు నిరంతరం పర్యవేక్షించడంతో పాటు స్థానికంగా కార్యదర్శులు ఉండేలా, ప్రజా సమస్యలను పట్టించుకునే విధంగా చర్యలు తీసు కున్నప్పుడే ప్రజల ఇబ్బందులు తొలగుతాయని మండల ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తును వీడి ప్రజల సమస్యలను పరిష్కారించే విధంగా జిల్లా కలెక్టర్ మేడం మీరే పట్టించుకుని చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**ఉపాధి హామీ డబ్బులు ఇప్పించండి**

**నలుగు నరసయ్య, అనంతారం...**

ఉపాధి హామీ పని చేసి ఆరు ఏడు నెలలు అవుతున్నా ఇంతవరకు డబ్బులు రాలేదు. ఫీల్డ్ అసిస్టెంట్లు అడిగితే ఇదిగో వస్తాయి.. అంటున్నారు కానీ ఇంకా రాలేదు. ఇప్పటికైనా అధికారులు నాకు డబ్బులు వచ్చేలా చూడండి.

**కనీస సౌకర్యాలు లేవు**

**వెంకటమ్మ, ఉపాధి కూలీ...**

మండుటెండల్లో ఎండలో ఉపాధి పనులు చేస్తున్న కనీసం వాటర్, టెంటు, ఫస్ట్ ఎయిడ్ కాని ఏమి సౌకర్యాలు లేవు. మండలంలోని కొన్ని పంచాయితీల్లో సెక్రెటరిలు ఉపాధి హామీ పథకం దగ్గరికి వచ్చి చూసిన దాఖలాలు లేవు. మాకు సౌకర్యాలు కల్పించండి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు అందేలా చూడాలి.

# ఉత్సవాలు ఐక్యతను పెంపొందించాలి

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉత్సవాలు, జాతరలు ప్రజల్లో ఐక్యత భావాన్ని పెంపొందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. ప్రజలంతా కుల మతాలకు అతీతంగా మత సామరస్యాన్ని కాపాడుతూ సమాజాభివృద్ధికి తోడ్పాడాలన్నారు. గురువారం పాల్వంచలోని వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు కూనంనేని సాంబశివరావుకు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ పూర్వ కాలం నుంచి పేద, ధనిక అనే భావం పాటించరాదన్న భావంతోనే అందరిని గౌరవిస్తూ ఉత్సవాలు నిర్వహించే వారని ఆ పద్ధతిని ఇప్పటికీ కొనసాగించాలన్నారు. మత ఉన్మాదం ప్రమాదానికి దారి తీస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణ చందర్‌రావు, పాల్వంచ పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు దుగ్గిరాల సుధాకర్, వీసంశెట్టి పద్మజ, అన్నారావు వెంకటేశ్వర్లు, శెనగారపు శ్రీనివాసరావు, శేఖర్‌బాబు, ఎస్‌కె లాల్‌పాషా, వనపర్ల జాక్రయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దేశం తెలంగాణ వైపు చూస్తుంది

(మొదటిపేజీ తరువాయి)
మల్లికార్జున్ ఖార్గే, ప్రియాంక గాంధీ పాల్గొంటారని కాంగ్రెస్ మ్యానిఫెస్టోను విడుదల చేస్తారని తుమ్మల తెలిపారు. గత ప్రభుత్వంలో అన్ని శాఖలను నిర్వీర్యం చేశాయని తాము వాటిని సరిదిద్దే పనిలో ఉన్నామన్నారు. ఖమ్మంజిల్లాలో నీరు లేక పంటలు ఎండిపోలేదని ఎక్కువ భాగం భూగర్భ జలాలపైనే ఆధారపడి పంటలు పండిస్తున్నారని రోజుకు రూ. 50 కోట్లు ఖర్చు పెట్టి రాష్ట్రంలో విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. పార్లమెంటు ఓట్ల కోసం బిఆర్ఎస్ నీచ రాజకీయాలు చేస్తుందని నీళ్ల రాజకీయాలు చేస్తుందని అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా మారలేదన్నారు. బిఆర్ఎస్‌కు రాష్ట్రంలో ఒక్క స్థానం కూడా రానివ్వబోమని తుమ్మల సవాల్ విసిరారు. తుక్కుగూడ జన జాతరకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని తుమ్మల పిలుపునిచ్చారు. ఈ సభలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మి నారాయణ, నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్, దొబ్బల సౌజన్య, మలీదు వెంకటేశ్వర్లు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్, మిక్కిలినేని నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి వద్దిరాజు ప్రమాణ స్వీకారం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రెండవ దఫా రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్ర గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంటు ప్రాంగణంలో ఉపరాష్ట్ర పతి రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ధన్కర్‌తో పాటు పార్లమెంటు వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పలువురు రాజ్యసభ సభ్యులు గాయత్రి రవికి శుభాకాంక్షలు తెలిపారు.

## కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ కార్మికులకు కమీషనర్ వేణు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ వేణు మాట్లాడుతూ వడదెబ్బ నివారణకు ఓఆర్ఎస్ తాగడం ఎంతో మంచిదని, ఎండ తీవ్రతను తట్టుకునే విధంగా కార్మికులకు ముందస్తు జాగ్రత్తగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగిందని వేణు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు, ఇతర కార్మికులు ఎక్కడైనా పనిచేసేటప్పుడు ఎండ వలన ఏమని ఇబ్బంది కలిగిన వెంటనే ప్రక్కకు కూర్చొని ఆఫీస్ వద్దకు రావాలని ఆయన సూచించారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో ఆరోగ్యాల పట్ల జాగ్రత్త తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు అధికారులు, మున్సిపాల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బినామీ పేర్లతో దళితబంధు యూనిట్లు..!

**ప్రజాపక్షం/కారేపల్లి:** గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో దళితబదు పథకంలో భాగంగా సింగరేణి మండలానికి 21 మందికి లబ్ధిదారులకు వచ్చింది. వచ్చిన 21 మంది లబ్ధిదారుల్లో సగం మంది బినామీ పేర్లతో ఎస్సీలను ఉపయోగించి అగ్రవర్ణాలు లబ్ధిపొందారు. దళితబంధు పథకంలో జీవితాలు బాగుపడతాయని దళితులు కలలు కన్నారు. కాని కలగానే మిగిలింది. మండలానికి వచ్చిన 21 యూనిట్లలో మొత్తం కూడా బిఆర్ఎస్ కార్యకర్తలకు వచ్చినవారు కూడా ధనికులే అవ్వడం గమనార్హం. బిఆర్ఎస్ కార్యకర్తలకు దళితబంధు రావడంలో బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన జిల్లా ఎమ్మెల్సీ కీలకపాత్ర పోషించాడు. ఆయనకు సంబంధించిన మనుషులకు ఇప్పించి దానిలో నుండి కొంత కమీషన్ తీసుకొన్నట్లు సమాచారం. ఆ ఎమ్మెల్సీ గత ప్రభుత్వంలో వైరా నియోజకవర్గానికి ఎమ్మెల్యే ఆయనే అయినట్లు వ్యవహరించి గ్రూపు రాజకీయ ప్రోత్సహించాడు. రెండోసారి దళితబంధు యూనిట్లు వస్తామని చెప్పి ఎమ్మెల్సీకి సంబంధించిన ఆయన ముఖ్య అనుచరుడు. 35మంది దగ్గర డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. దళితబంధు రాకపోవడంతో వారికి తిరిగి డబ్బులు ఇచ్చేశారు. దళితబంధు వచ్చిన వారు వారికి వచ్చిన యూనిట్లు విక్రయించి వచ్చిన సొమ్ము నుండి కొంత నగదు ఎమ్మెల్సీ ముఖ్య అనుచరుడికి ఇచ్చినట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సమగ్రమైన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బిసి సంఘ నాయకులు కోరుకుంటున్నారు.

## భ్రూణ హత్యలపై రౌండ్ టేబుల్ సమావేశం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలో భ్రూణ హత్యలు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రగతిశీల మహిళా సంఘం (పివోడబ్ల్యూ) ఆధ్వర్యంలో రౌండ్ టేండ్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పివోడబ్ల్యూ జిల్లా కమిటీ నేడొక ప్రకటనలో తెలిపింది. ఈనెల ఐదున శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు గట్టయ్య సెంటర్‌లోని టెండర్ రూట్స్ పాఠశాలలో ఈ రౌండ్ టేండ్ సమావేశం జరుగుతుందని తెలిపారు. వివిధ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని పివోడబ్ల్యూ జిల్లా కమిటీ కోరింది. ఆడ పిల్ల అని తెలియగానే అబార్షన్లు చేస్తున్నారని నిబంధనలకు వ్యతిరేకంగా జరుగుతున్న దీనికి వ్యతిరేకంగా పివోడబ్ల్యూ పోరాడనుందని వారు తెలిపారు.

## ప్రశాంతంగా జెఈఈ మెయిన్స్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** జెఈఈ మెయిన్స్ సెషన్ 2 పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఖమ్మంలోని ఐదు కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహించారు. బొమ్మ, శ్రీ చైతన్య, ఎస్‌బిఐటి, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల, ప్రియదర్శిని కళాశాలల్లో ఈ పరీక్షలను నిర్వహించారు. మొత్తం 537 మందికి గాను 501 మంది విద్యార్థులు హాజరయ్యారు. సాయంత్రం 535 మందికి గాను 499 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తంగా 36 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

# పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల పరిశీలన





**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను గురువారం కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. మండల పరిధి లోని హనుమ తండ కల్లూరు లోని కలాలివాడ, పేరువంచ, ముగ్గు వెంకటాపురం గ్రామాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులైన విద్యుత్ సౌకర్యం, మంచినీరు, ఫ్యాను, లైట్ , మరుగుదొడ్డి, ర్యాంపు, సౌకర్యం రన్నింగ్ వాటర్ ను పరిశీలించారు. అదే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. మౌలిక వసతులు పూర్తికాని చోట పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ డిఇ రాంబాబుకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ఎస్పి క్రాస్ రోడ్డులో ఉన్న 5/2 స్థలం పాయపూర్ చెరువు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పేరువంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చుట్టూ ఫెన్సింగ్ వేయించాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. పాఠశాల ఆవరణ కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించారు . ముగ్గు వెంకటాపురం గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ తల్లి దేవాలయం గ్రీన్ ఫీల్డ్ హైవేలో కలిసిపోయిందని దాని నష్టపరిహారం రెండు సంవత్సరాలైనా ఇవ్వలేదని గ్రామస్తులు కలెక్టర్కు ఫిర్యాదు చేయగా వెంటనే జేసి మధుసూదన్ నాయక్ కు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అట్టి నగదును గ్రామస్తులజాయింట్ ఖాతాలో జమ చేయాలని సూచించారు. అంతరాష్ట్ర చెక్ పోస్ట్ పంచదార పరిశ్రమ వద్ద చెక్ పోస్ట్ లో ఉన్న వాహన రాకపోకల రికార్డులను అడిగి పరిశీలించారు. గ్రామాలలో మంచినీటి సరఫరా వివరాలను అధికారులును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెసి మధుసూదన్ నాయక్, సి పి సునీల్ దత్, తహాశీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్సై షేక్ షాకీర్, పలు శాఖల జిల్లా స్థాయి అధికారులు, ప్రముఖులు,ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# మోడిఫైడ్ సైలెన్సర్లపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్

**-వింత శబ్ద కాలుష్యం కలిగించే 79 సైలెన్సర్లు తొలగింపు**
**-ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ద్విచక్ర వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చిన వారిపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఖమ్మం నగరంలో ఇటీవల కాలంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మోడిఫైడ్ సైలెన్సర్లతో నడిపే వాహనాలపై గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కొందరు యువత ద్విచక్ర వాహనాలకు సంబంధిత సంస్థ ఇచ్చిన సైలెన్సర్లను మార్పు చేసి అధిక శబ్దం వచ్చే వాటిని అమర్చుతున్నారని దీని వల్ల విపరీతమైన ధ్వని కాలుష్యం ఏర్పడడంతో పాటు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేలా రోడ్లపై ఆకస్మాత్తుగా వింత శబ్దాలు చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. మరి కొందరు వాహనాల హారన్‌లను సైతం అదే తరహాలో అమర్చుతున్నారని అటువంటి వారి ఆట కట్టించేందుకు ట్రాఫిక్ పోలీస్ దృష్టి సారించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలకు సిద్ధమైందన్నారు. మోడిఫైడ్ సైలెన్సర్ల వరకు తొలగించి ఒక్కో వాహనదారుడికి రూ. 1000 జరిమానా విధిస్తున్నామన్నారు. ఇకపై ధ్వని కాలుష్యాన్ని కలిగించే వాహనాన్ని సీజ్ చేసి చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా సంబంధిత వాహనానికి ఉన్న మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగించి జరిమానా వేసి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. తొలగించిన సైలెన్సర్ల స్థానంలో ఆ సంస్థ ఇచ్చిన పొగ గొట్టాలని అమర్చాలని సూచిస్తున్నామని పేర్కొన్నారు. ఈ డ్రైవ్ ఇంకా కొనసాగుతాయని, నిబంధనలు అతిక్రమించి తరచూ ఇలాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. అదేవిధంగా లైసెన్స్, నెంబరు ప్లేటు, నెంబరు సక్రంగా లేని, నెంబర్ ట్యాంపారింగ్ కలిగిన, నెంబరు తుడిచివేసిన వాహనాలను గుర్తించేందుకు తనిఖీలు చేస్తున్నామని, పట్టుబడిన వాహనాలపై ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ మోహన్‌బాబు, ఎస్ఐ రవి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# కాలువ కట్టలపై పకడ్బందీ గస్తీ..!

**నీటి చోరీ నియంత్రణకు ముందస్తు చర్యలు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఖమ్మం పట్టణ ప్రజలకు తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన నీటిని సక్రమంగా ఖమ్మం చేరేలా అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. గురువారం నేలకొండపల్లి మండలం లోని సాగర్ కాలువ కట్ట పై అధికారులు గస్తీ కాస్తున్నారు. పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ కాలువ ద్వారా ఖమ్మం కు వచ్చే నీటిని రైతులు పంట పొలాలకు వినియోగించకుండా ఉండేందుకు,కాలువ కట్టల కు ఇరువైపులా ఉన్న విద్యుత్ మోటార్ల ఫీజ్‌లను తొలిగించారు. నీటి సరఫరా కాకముందే అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. పది గ్రామపంచాయతీ కార్యదర్శులు రాత్రింబవళ్లు కాపాలా కాసేలా కార్యచరణ ను రూపొందించారు. మండల పరిషత్ అధికారి యం.యర్రయ్య, నేలకొండపల్లి ఎస్సై తోట నాగరాజు, మిషన్ భగీరథ డీఈఈ ఓం ప్రకాష్, ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు, ఏఈ నరేష్, విద్యుత్ శాఖ అధికారులు, ఆయా పంచాయతీ కార్యదర్శులు కాలువ కట్టల పై విధులు నిర్వహిస్తున్నారు. చుక్కనీరు కూడ పోకుండా లాక్‌ల వద్ద, బస్తాలతో కట్టుదిట్టం చేశారు. అడుగుగడుగునా వివిధ శాఖల అధికారులు పహారా కాస్తున్నారు. అమ్మగూడెం, రాజేశ్వరపురం వద్ద ఉన్న యూటీల వద్ద సిబ్బంది ని అప్రమతం చేశారు. కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్ మండలాల అధికారులు ఆయా ప్రాంతాలలో గస్తీ పెంచారు. పాలేరు నుంచి ఖమ్మం వరకు నీటి సరఫరా లో ఎలాంటి అవంతరాలు లేకుండా ఉండేలా అధికార యంత్రాంగం ను అప్రమతం చేశారు. కాలువ కట్ట కు ఇరువైపులా ఉన్న వ్యవసాయ మోటార్ల ఫీజ్‌లను తొలిగించటం తో పాటు, రాత్రి వేళలలో కూడ కేవలం సింగిల్ ఫేజ్ విద్యుత్ ను సరఫరా చేసేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మొత్తం మీద నీటి ని చోరి చేయకుండా గట్టి బందోబస్తు ను ఏర్పాటు చేశారు.

# ఓటు వజ్రాయుధం




**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకునేందుకు రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం ఓటు అని పాలేరు రిటర్నింగ్ ఆఫీసర్ పి.రాజేశ్వరి అన్నారు. గురువారం ఖమ్మం రూరల్ మండలంలోని బారుగూడెం,పెద్దతండాలోని నర్సింగ్ కళాశాలో (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యూకేషన్, ఎలక్ట్రల్ పార్టిస్‌పేషన్) అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఓటును రాజకీయ పార్టీలకు అధికారం అందించడం కోసం ఉపయోగపడే సాధన అనే భావనను వీడి ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడే ఆయుధంగా ప్రతి ఒక్క ఓటరు గుర్తించాలన్నారు. ఓటు అనేది ఎంతో అమూల్యమైనదని దీంతో అధికారం ఇవ్వచ్చు అదే అధికారం నుంచి దూరం చేయవచ్చునన్నారు. కానీ ప్రలోభాలకు లోనయ్యి ఓటును మాత్రం అమ్ముకోకుండా ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల భవిష్యత్తును నిర్దేశించే ఓటుతో మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత భారత పౌరులుగా మనపై ఉందన్నారు. ఎన్నికలలో జరుగుతున్న ఉల్లంఘనలను అరికట్టేందుకు ఎన్నికల నిర్వాహకులు తీసుకువచ్చిన సి విజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.అనంతరం ఓటు హక్కు వినియోగంపై ప్రజలు,విద్యార్థులతో ప్రమాణం చేపించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ బి.రాంప్రసాద్, ఎంఈఓ శ్యాంసన్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తప్పదు




**ప్రజాపక్షం/ తల్లాడ :** ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు రెండు నెలలు గడుస్తున్నా కూలీ డబ్బులు రాక, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని, అధికారులు స్పందించి వెంటనే వారి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తప్పదని తెలంగాణ వ్య.కా.సం బికేఎంయు ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ హెచ్చరించారు. గురువారం తల్లాడలో ఉపాధి కూలీల సమావేశం ఓర్సు రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీల పట్ల నరేంద్ర మోడీ ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తుందదన్నారు. కూలీలు పనులు చేసి నెలలు గడుస్తున్నా వారికి డబ్బులు ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకానికి ఇవ్వాల్సిన నిధుల్లో కోత పెట్టి పథకాన్ని తీసివేయడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం తన మొండి వైఖరిని మానుకుని ఉపాధిహామీ కూలీలకు నెలనెలా కూలీ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక, రైతు, కార్మిక వ్యతిరేక విధానాల అవలంభిస్తున్న బిజెపికి పతనం తప్పదని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పుతారన్నారు. అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు తాటికొండ లీలావతి, కార్యదర్శి ఎస్‌కె.మున్నీ, సహాయ కార్యదర్శిగా కృష్ణవేణి, కోశాధికారిగా, ఎస్‌కె. సలీమా, సన్నీ, మౌనిక, భూలక్ష్మీ , లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటుకు గురైన రైతు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని ఆరెగూడెం లో రైతు పూజల సీతారాములు పాము కాటు కు గురైయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని ఆరెగూడెం గ్రామానికి చెందిన రైతు సీతారాములు గురువారం వరి పొలం వద్ధ కు వెళ్లారు. పాము కాటేసింది. స్థానికులు గమనించి వెంటనే నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్ కు తరలించారు. ప్రధమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాజశేఖర్ మాట్లాడారు...రైతులు పొలాల వద్ధ కు వెళ్లినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించిన విద్యార్థి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల పరిధిలోని మద్దుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పోట్రు సాయి ప్రశాంత్ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సాల్కర్ షిప్‌కు అర్హత సాధించాడు. 2022 నుంచి 2023 సంవత్సరంలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ నేషన్‌మన్స్ కమ్ మెరిట్ పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వం నుంచి వచ్చే రూ 12వేలు స్కాలర్ షిప్‌కు ఓసి(జనరల్) కేటగిరి నుంచి ఎంపిక కావడం జరిగింది. అర్హత సాధించిన విద్యార్థి సాయి ప్రశాంత్‌ను ప్రధానోపాధ్యాయురాలు భవాని, ఉపాధ్యాయులు ఎం తులసి, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, పీఈటీ జయరాం తదితరులు అభినందించారు. అదే విధంగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, పేరెంట్స్ కమిటీ బాధ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

## రెండు లక్షల రుణమాఫీ తక్షణమే చేయాలి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** రైతులకు రెండుల క్షల రూపాయల రుణమాఫీని తక్షణమే చేయాలని పంటనష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని అఖిలభారత రైతుకూలీసంఘం జిల్లా నాయకుడు షేక్ ఖాసిం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిదిలోని విక్రమ్‌నగర్‌లో పంటనష్టపోయిన రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో గురవారం ఆయన మాట్లాడారు. నీళ్లులేక మొక్కజొన్న , వరి , పెసర తదితర పంటలు ఎండిపోయాయని దీనివలన రైతులు తీవ్రంగా నష్టపోయిరని పేర్కొన్నారు. నీరులేక వైరా రిజర్వాయర్ వట్టిపోయిందని సాగర్ నీటితో వైరా రిజర్వాయర్ నింపాలని అని అన్నారు. వైరా రిజర్వాయర్ ద్వారా 100 గ్రామపంచాయతీలకు మంచి నీరు అవసరం ఉందని అందువలన రిజర్వాయర్‌ను సాగర్‌జలాలతో నింపాలని అన్నారు. కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. నష్టపరిహారంగా ఎకరానికి రూ 30 వేలు ఇవ్వాలని అన్నారు. యాసంగి వడ్లకు క్వింటాకు రూ 500 లు బోనస్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం నాయకులు గుగులోత్ బాబు , ఇస్లావత్ కృష్ణ , ధరావత్ మంగ్యా , లకావత్ బాసు తదితరులు పాల్గొన్నారు.

## పాలేరులో ప్రసాద్‌రెడ్డి విస్తృత పర్యటన




**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు,జిల్లా కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి గురువారం విస్తృతంగా పర్యటించారు. తొలుత హైదరాబాద్‌నుంచి వస్తున్న ఆయనకు నాయకన్‌గూడెం టోల్ ప్లాజా వద్ద కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి నాయకన్‌గూడెం చేరుకుని లిక్కి వెంకటేశ్వర్లు కుమారుడు ప్రదీప్ వివాహ వేడుకకు హాజరై కొత్తజంటను ఆశీర్వదించారు. ఇదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న జహంగీర్ తల్లిని,పెరికసింగారంలో అజ్మీరా మంగ్యాను పరామర్శించారు.అదేవిధంగా అజ్మీరా దీప్తా కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను దీవించారు. అనంతరం ఖమ్మం రూరల్ మండలంలోని టీసీవీరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో కూసుమంచి మండలం కొత్తూరుకు చెందిన ముసుగుల వెంకట్‌రెడ్డి కుమార్తెను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగించుకోవాలి



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఏదులాపురం పిఏసిఎస్ ద్వారా ఏర్పాటు చేసిన నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ వి.నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఖమ్మం రూరల్ మండలంలో 202324 సంవత్సరాలకు గాను పండించిన 2,600 ఎకరాల యాసంగి వరి పంటను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గుదిమళ్ల,గోల్లపాడు, కస్నాతండా,తీర్థాల గ్రామాలలో కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. గ్రేడ్ ఏ రకంకు 2203, సాధారణ రకంకు 2183లుగా మద్దతు ధరను నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రైతులు వడ్లలో తేమ 17శాతం,చెత్త,తాలు,మట్టి పెల్లలు,రాళ్లు 1శాతం మించకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంటలను కాపాడుకోవడానికి సరైన నీళ్లతడులను ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమాలలో తల్లంపాడు క్లస్టర్ వ్యవసాయ విస్తీర్ణ అధికారి విజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

## వాణిజ్య పన్నుల శాఖ అధికారులపై ఏసీబీ దాడులు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని తిరువూరు క్రాస్ రోడ్డులో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు సిబ్బంది వాహనములు తనిఖీ చేయు సమయంలో వాహనదారుల వద్ద నుంచి అక్రమంగా నగదు వసూలు చేస్తున్న సమాచారంతో మరియు ఫిర్యాదుతో బుధవారం అర్ధరాత్రి శ్రీరామ్ ఖమ్మం వారు కల్లూరు లోని తిరువూరు క్రాస్ రోడ్ లో తనిఖీలు చేస్తుండగా ఏసీబీ ఖమ్మం రమేష్, డిఎస్పి అవినీతి నిరోధక శాఖ ఖమ్మం వారి ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా వాణిజ్య పన్నుల శాఖ వారి వద్ద అనధికారికంగా ఉన్న రూ. 8520 నగదు మధ్యవర్తుల సమక్షంలో స్వాధీన పరుచుకొని మరియు సంబంధిత రికార్డులను స్వాధీన పరుచుకొని అవకతవకలు ఉన్నట్లు తెలిసింది. అనంతరం విచారణ చేస్తున్నట్లు ఏసీబీ అధికారులు సునీల్ కుమార్ , మహేష్, ఇన్స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే ఫోన్ చేయాలని తెలిపారు .అట్టి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు టోల్ ఫ్రీ నెంబర్ 10 64, కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు.

# కొణిజర్లలోనే అపరాలు అత్యధికం

-పెసర సాగులో జిల్లాకే ఆదర్శం
-కొణిజర్ల మండల వ్యవసాయాధికారి బాలాజీ



**ప్రజాపక్షం/కొణిజర్ల :** జిల్లాలోనే అత్యధికంగా అపరాలు పండించేది కొణిజర్ల రైతులని ఈ సంవత్సరం నాగార్జునసాగర్ నీళ్లు రాకపోయినా పెసరపంట సాగు చేసి మంచి దిగుబడులుపొందారని అపరాలు పండించడంలో మండలం ముందువరుసలో ఉందని కొణిజర్ల వ్యవసాయాధికారి బాలాజీ అన్నారు. గురువారం మండల పరిదిలోని సింగరాయపాలెంలో పెసరపంటను పరిశీలించినట్లు తెలిపారు. గత కొన్నిసంవత్సరాలుగా మండలంలోని రైతులు వానాకాలం పెసర , మినుములు వేసి రెండోపంటగా మొక్కజొన్న వేసేవారని అన్నారు. కొణిజర్ల మండలంలో సుమారు 1500 ఎకరాలు వరకు పెసర పంట సాగుచేశారని అన్నారు. జిల్లాలో అన్ని మండలాల్లోని రైతులు టిఎస్ సీడ్ లేదా ప్రయివేటు డీలర్స్ వద్ద విత్తనాలు కొంటారని కాని కొణిజర్ల మండలంలోని రైతులుమాత్రం రైతుపండించిన పంటనుంచే విత్తనాలు తయారు చేస్తారని రైతునుంచి ఇంకొక రైతులు విత్తనాలు కొంటారని తెలిపారు. దీనివలన మేలురకం విత్తనాలుతోపాటు విత్తనాలు అమ్మే రైతులకు కూడా మంచి లాభాలు వస్తున్నాయని వివరించారు. మండలంలో 60 శాతం మంది రైతులు ఒకరైతునుంచి మరొకరైతు కొంటారని అన్నారు. ఎకరాకు రూ 9000 వేలు పెట్టుబడి అవుతుందని ఎకరాకు 5 నుంచి 7 క్వింటాలు దిగుబడి వస్తుందని ప్రస్తుతం మార్కెట్‌లో ధర క్వింటాకు రూ 7800 వరకు ఉన్నట్లు తెలిపారు. ఎకరాకు సుమారు రూ 30 వేలు వరకు రైతులకు లాభాలు చేకూరుతాయని అన్నారు. పంటమార్పిడివలన మంచి దిగుబడి వచ్చేది ఒక్క పెసర పంటమాత్రమే అని అన్నారు. 80 నుంచి 100 రోజుల్లో మంచిలాభాలు వచ్చేది పెసరపంటమాత్రమే అని అన్నారు. ఖమ్మం జిల్లా మొత్తంలో 8800 ఎకరాలు పెసరసాగు చేస్తే ఒక్క కొణిజర్ల మండలంలోనే 1500 ఎకరాలు పెసరపంట సాగు చేగుచేసి జిల్లాకే ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



ర్యాలీ ప్రారంభించిన కలెక్టర్




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్లు విధిగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డా.ప్రియాంక ఆలా అన్నారు. గురువారం అవగాహన కార్యక్రమంలో భాగంగా ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ పోస్టాఫీస్ సెంటర్ నుండి బస్టాండ్ వరకు సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ వరకు వెళ్లలేని దివ్యాంగులు, 80 సం. పై బడిన వృద్ధులు ఇంటి నుండే ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇందుకు ప్రభుత్వ అధికారులు, బిఎల్‌ఓలు సహకరిస్తారని చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే వారి కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ విద్యాచందన, సంక్షేమాధికారి వేల్పుల విజేత, టివిపిఎస్ సతీష్, ఎం ప్రవీణ్, ఖాదర్ బాబా, నగేష్, చాంధ్ పాషా, రాజయ్య, ఖాసీం, ఐసిడిఎస్, అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు, రిటైర్డ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

### గొత్తికోయ గ్రామాల్లో

# తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి





- గిరిజనుల సమస్యలు స్వయంగా తెలుసుకున్న కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** గొత్తికోయ గ్రామాల్లో తాగునీటి సమస్యతో పాలు ఇదర సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా అన్నారు. గురువారం చుంచుపల్లి మండపరిధిలోని పెనగడప పంచాయితీలో గల జగ్గారం, మర్పిగూడెం, పాలవాగు, గడ్డిగుప్ప గొత్తికోయ గ్రామాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనులతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలకు అందుతున్న సౌకర్యాలు, పిల్లల ఆరోగ్యం, చదువు, ఇతర మౌలిక సదుపాయాలు, ఆధార్, రేషన్ కార్డులు, ఉపాధి పనులు తదితర వివరాలు అడిగారు. దీంతో గ్రామస్తులు మాట్లాడుతూ కొందరికి పథకాలు అందడం లేదని తెలపడంతో ఎన్నికల తర్వాత దరఖాస్తు చేసుకుంటే అందేలూ చూస్తామని తెలిపారు. ప్రధానంగా గర్భిణీలు రామవరంలోని మాతశిశు ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రసవం సమయంలో ఆస్పత్రుల్లో చేరాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని, అంగన్‌వాడీ నుండి పౌష్టికాహారం అందించి సహకరించాలని సూచించారు. తమ గ్రామానికి తాగునీటి ఇబ్బంది ఉందని, బోరు వేయిస్తే కొంత సమస్య తీరుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో తాగునీటి సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ విద్యా చందన, మిషన్ భగీరథ డిఇ తిరుమలేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ శివయ్య, వసంత, తహశిలాద్ర్ పానం కృష్ణ, ఎంపిడిఓ అశోక్ కుమార్, ఎంపిఓ గుంటి సత్యనారాయణ, రఘుపతి, హనుమంతుతో పాటు నాలుగు గ్రామాల పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు..!

- దృష్టి సారించని సంబంధిత అధికారులు





**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులోని హ్యాపీ కిడ్స్ స్కూల్ ఎదుట మిషన్ భగీరథ నీరు గురువారం వృథాగా పోయింది.ఇండ్లకు పైప్‌లైన్ కనెక్షన్లు ఏర్పాటు చేసినప్పటికీ ఫ్లో కంట్రోల్ వాల్స్ బిగించ లేదు.దీంతో వాటర్ బురద కాలువలోకి వృథాగా పోతుందే తప్ప ప్రజలు వినియోగించుకోవటం లేదు. ఈ క్రమంలో నీరు సిసిరోడ్డుపై మడుగులా ఏర్పడటంతో స్కూల్‌కు వచ్చిన చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.వరంగల్‌క్రాస్ రోడ్డుపరిధిలో సుమారు 12వందల ఇండ్లు ఉండగా...750ఇండ్లకు మాత్రమే కనెక్షన్లను బిగించారు. వీటికి గాను ఇక్కడి రెండు ట్యాంకుల నుంచి ప్రతిరోజు 280లీటర్ల వాటర్‌ను అధికారులు సరఫరా చేస్తున్నారు. కానీ నీటి వృథాపై మాత్రం దృష్టి సారించడం లేదు. ఇందులో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం సైతం కొట్టొచినట్టు కనిపిస్తుంది. అసంపూర్తిగా పైప్‌లైన్లు ఏర్పాటు చేయడంతో నీటి వృథా నిత్యకృత్యం అయ్యింది.చిన్న చిన్న సమస్యలు పంచాయతీ అధికారులు చేపిస్తున్నప్పటికీ మేజర్ పైప్‌లైన్ సమస్యలతో నీటి వృథా అధికంగా ఉంటుంది. ఈ ప్రాంతాలలో జరుగుతున్న నీటి వృథాపై మిషన్ భగీరథ అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి. నీటి వృథాకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రజలకు అవగాహణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు కల్తీ



- పట్టించుకోని సంబంధిత అధికారులు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని 10 గ్రామపంచాయతీలలో గత నెల రోజులుగా 22 ప్రాంతాలలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు లీకేజీలతో విలువైన మంచినీరు కల్తీ కావడం వలన ప్రజలు అవే మంచినీరు తాగుతున్నారు. మండల పరిధిలోని చంద్రు పట్ల, చెన్నూరు, చిన్న కోరుకొండి, కల్లూరు, కప్పల బంధం, కృష్ణయ్య బంజర, పేరువంచ, తాళ్లూరు, వాచ్యనాయక తండా, ఎర్ర బోయినపల్లి గ్రామాలలో గత నెల రోజులుగా మంచినీరు మట్టి పాలు మంచినీరు బురద పాలు డ్రైనేజీలో కలుస్తున్న మిషన్ భగీరథ అధికారులకు మరమ్మత్తులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు మరమ్మతులు చేయాలని మొత్తుకున్న పట్టించుకోవడంలేదని పేర్కొంటున్నారు. ఈ విషయమై ఎంపీడీవో ద్వారా అధికారులకు తెలియపరిచామని వివరించారు. కల్తీ అయిన నీరు వాడుకలో తీసుకున్నందువలన దురదలు వస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయమై గ్రామపంచాయతీలలోని ప్రత్యేక అధికారులకు కార్యదర్శులకు తెలిపామని ప్రజలు వివరిస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులు 30 రోజులుగా పట్టించుకోనందున నీరు వృధా అవుతున్నాయని గ్రామస్తులు వివరిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవోను వివరణ కోరగా గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు కార్యదర్శుల ద్వారా ఫిర్యాదులు అందినట్లు, లిఖిత పూర్వకంగా వాటర్ గ్రిడ్ అధికారులకు సమాచారం అందించామని ఎంపీడీవో తెలిపారు.

# పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంఎల్‌ఏ పాయం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు గురువారం పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా మండల కేంద్రంలో భారతి భవన్ నందు మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ భజన నరసింహారావు కుమారుడు సందీప్ వెడ్స్ కల్పన వివాహ వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం గౌతమిపురం కాలనీలో దాముల రాములు కూతురు దివ్య ప్రధాన వేడుకలలో పాల్గొని ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, ప్రముఖ న్యాయవాది భజన సతీష్, లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు బాదం రమేష్‌రెడ్డి, భజన ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు మంద నాగరాజు, యారం రమణారెడ్డి, దాసరి సాంబ, చిప్పరాజు, భద్రం, కిషోర్, అనిల్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సురేంద్ర మోహన్‌ను కలిసిన మోదర్‌రావు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మంచినీటి సమస్య ఉన్న గ్రామాలను పర్యవేక్షించడానికి నియమించబడ్డ స్పెషల్ ఆఫీసర్ సురేంద్ర మోహన్ గురువారం భద్రాచలం వచ్చారు. భద్రాచలం పర్యటనకు వచ్చిన త్రాగునీటి సప్లై స్పెషల్ ఆఫీసర్ సురేంద్ర మోహన్‌ను భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు ఐటిసి గెస్ట్ హౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకేలు అందించి స్వాగతం పలికారు.

## 'మీ ఓటే మీ భవిష్యత్' విజయవంతం




**ప్రజాపక్షం/ములకలపల్లి:** ఐసిడిఎస్ దమ్మపేట ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ములకలపల్లి మండల కేంద్రంలో గురువారం మీ ఓటే మీ భవిష్యత్ అనే కార్యక్రమం జరిగింది. సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్‌లో భాగంగా ఓటర్లకు అవగాహన కల్పించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రాజెక్ట్ అధికారిని జ్యోతి తెలిపారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని వృద్ధులు, కొత్తగా ఓటు హక్కు కలిగిన యువకులను కలిసి ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఓటు హక్కు కలిగిన పౌరుడు విధిగా తమ ఓటు వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటుకు ఉన్న బలాన్ని అందరూ గుర్తించాలని కోరుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏసిడిపివో సీతారాములు, సూపర్వైజర్లు బి సామ్రాజ్యం, ఆర్ నాగమణి, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు మౌలిక సౌకర్యాలు




**ప్రజాపక్షం/కరకగూడెం:** మండల పరిధిలోని మండుటెండలో ఉపాధి పనులు కథనానికి ప్రజాపక్షంలో వచ్చిన వార్తకు స్పందించిన అధికారులు వెంటనే ఉపాధి హామీ కూలీలకు టెంటు, కూల్ వాటర్, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాపక్షం పాత్రికేయులు దుర్గం ప్రేమకుమార్‌ను ఆయన రాసిన వార్త కి ఉపాధి హామీ కూలీలు అభినందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎంపీఓ కుమార్, ఏపీఓ శ్రీనివాస్, సెక్రెటరీ శ్యాంసుందర్ రెడ్డి ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టారాజ్యంగా వాహనాలు పార్క్ చేస్తే చట్టరీత్యా చర్యలు



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు పట్టణంలో అంబేద్కర్ సెంటర్, సాయి మమత హాస్పిటల్ ముందు మరియు ఎస్‌బిఐ బ్యాంక్ ఎదురుగా, పూల కొట్టు సెంటర్, మెయిన్ రోడ్డు మధ్యలో కొందరు తమ తమ ఆటోలు, కార్లు, టూవీలర్లు పార్క్ చేసి వెళ్తున్నారని, ఇలా పార్కింగ్ చేయడం వలన మిగతా వాహనదారులకి ఇబ్బంది కలగడమే కాకుండా ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని ఇక నుండి ఇలాంటి ప్రాంతాలలో కనుక వాహనదారులు పార్కింగ్ చేస్తే అట్టి వాహనదారుల యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు మణుగూరు సిఐ సతీష్ కుమార్ తెలిపారు. అలాగే నిబంధనలకు విరుద్ధగా పార్క్ చేసిన వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి అట్టి వాహన యజమానులపై కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. కావున పట్టణ ప్రజలందరూ దీనిని దృష్టిలో ఉంచుకొని రోడ్డుకు ఇరు వైపులా వైట్ లైన్ దాటి వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

## ఉపాధి కూలీకి పాము కాటు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన అజ్మీర మంగ్య గురువారం ఉదయం పొలాలలో కాలువ లో ఉపాధి పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో సమీపంలోని ఉన్న ఉపాధి కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్ బద్రు సహకారంతో కల్లూరు లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు నవ్య కాంత్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యాన్ని అందించారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో హేమమాలిని, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్ లు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం పొందుతున్న కూలిని పరామర్శించారు. వైద్యం వెంటనే అందడంతో ఆరోగ్య పరిస్థితి అదుపులో ఉందని వైద్యులు పేర్కొన్నారు.

## బ్రిలియంట్ విద్యార్థికి ఏఎస్‌పి అభినందనలు




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఇటీవల ప్రకటించిన సైనిక్, నవోదయ ఫలితాలలో సీట్ సాధించిన బ్రిలియంట్ విద్యార్థి కె నేత్ర నిఖిల్‌ని భద్రాచలం ఏఎస్‌పి పంకజ్ పరితోష్ అభినందించారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతం అయిన సారపాకలోని విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య నందిస్తూ వారిని జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తూ ఉజ్వల భవిష్యత్ ఉన్నతికి కృషి చేస్తున్న బ్రిలియంట్ విద్యాసంస్థ ఈ ఏజెన్సీలో వుండటం ఎంతో హర్షణీయమని అన్నారు. మా కుమారుడు నేత్ర నిఖిల్ సైనిక్, నవోదయలోను సీట్లు సాధించేలా కృషి చేసిన బిఎన్‌ఆర్‌కి, బ్రిలియంట్ విద్యా సంస్థలకు తల్లిదండ్రులుగా కాటి నవీన్‌కుమార్, పల్లవితలు జీవితాంతం బుణపడి ఉంటామని తెలిపారు.

## పంచెకట్టు వేడుకలో పాల్గొన్న రేగా



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** భద్రాచలం పట్టణంలోని కేకే ఫంక్షన్ హాల్ నందు సారపాక గ్రామానికి చెందిన బూర్గంపాడు మండల సొసైటీ ఛైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, సౌజన్య దంపతుల కుమారుడు వేణు చైతన్య పంచెకట్టు మహోత్సవంలో రాష్ట్ర మాజీ ప్రభుత్వ విప్, మాజీ పినపాక శాసన సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, జెడ్‌పిటిసి దంపతులు కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డిలు హాజరై, అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో మణుగూరు జెడ్‌పిటిసి పోశం నరసింహారావు, బిఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, మాజీ ఎంపిటిసి వల్లూరిపల్లి వంశీకృష్ణ, బిఆర్ఎస్ మణుగూరు మండల, పట్టణ అధ్యక్షులు ముత్యం బాబు, అడపా అప్పారావు, నాయకులు పోతిరెడ్డి గోవింద్‌రెడ్డి, బిజ్జం శ్రీకాంత్‌రెడ్డి, సుదిరెడ్డి గోపిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మిట్టకంటి సురేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, తాళ్లపల్లి యాదగిరి గౌడ్, మేకల రవి, నూకర రమేష్, ముద్దంగుల కృష్ణ, తాతా రమణ, కర్రీ నాగేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు, బంధు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా కాషాయీకరణను వ్యతిరేకిద్దాం




**-నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి**
**-ఏఐఎస్ఎఫ్ జిల్లా సమావేశంలో**
**రాష్ట్ర సహాయ కార్యదర్శి రామకృష్ణ**

**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లిః** కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో బిజెపి అనుబంధ ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులపై ఆనాటి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ పిలుపునిచ్చారు. శేషగిరి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షులు జర్పుల ఉపేందర్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి విద్యను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలని చూస్తుందని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేసి అందుకే విదేశీ విశ్వ విద్యాలయాలకు అనుమతి ఇచ్చిందని, స్వదేశంలో కూడా ఆదాని అంబాని టాటా లాంటి కార్పొరేట్ సంస్థలకు విశ్వవిద్యాలయాలు పెట్టుకునేందుకు వెసులుబాటు కల్పించిందన్నారు. ఈ విధానాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థ ధ్వంసం చేయడానికి తీసుకుంటున్న చర్యలని విమర్శించారు. విద్యను కాషాయీకరణ వైపు తీసుకెళుతూ శాస్త్రీయమైన ఆలోచనలను, శాస్త్రీయ విద్యను దూరం చేసేందుకే మత భావాలు గల పాఠ్యాంశాలను జాతీయ నూతన విద్యా విధానం పేరుతోను తీసుకొస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యా వ్యతిరేక సంస్కరణను విధానాలకు వ్యతిరేకంగా చైతన్యం గల ఏఐఎస్ఎఫ్ నాయకత్వంలో విద్యార్థులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. నేడు దేశంలో నూతన విద్యా విధానం పేరుతో యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. యూనివర్శిటీలను మూడు, నాలుగు రకాలుగా విభజన చేసి విద్యను మరింత కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, కమర్షియలైజ్, కాషాయీకరణ చేస్తుందన్నారు. ఈ విధానాలు ప్రభుత్వం విద్య వ్యవస్థను ధ్వంసం చేయడానికి తీసుకుంటున్న చర్యలని వారు విమర్శించారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఆరెస్సెస్ ఎజెండా అమలుకు బిజెపి ప్రయత్నం చేస్తుందని, అలెవెన్స్ నేపథ్యం ఉన్నవారినే యూనివర్శిటీల్లో నియామకాలు చేస్తుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 10% బడ్జెట్ కేటాయింపులు చేయకుండా జిడిపిలో 6% నిధులు కేటాయించకుండా ఎలా నూతన విద్యావిధానం అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. నూతన విద్యా విధానం విశ్వవిద్యాలయాల ఫండ్ కట్స్, ఫెలోషిప్స్ ఇవ్వకపోవడం, ఖాళీలు భర్తీ చేయకుండా ఉండటం, యూనివర్శిటీల్లో ప్రజాస్వామ్య వాతావరణ లేకుండా చేయడంపై ఉద్యమించాలని అన్నారు. కెస్ఎం కళాశాలను అప్‌డేట్ చేసి జెఎన్‌టియు యూనివర్శిటీగా ఏర్పాటు చేయాలన్నారు. టెక్నికల్ కోర్సులు పెంచి జిల్లా పరిధిలోని విద్యార్థులకు అవకాశాలు కల్పించాలని కోరారు. కాకతీయ యూనివర్శిటీ అనుబంధంగా ఉన్న కెఎస్ఎం కళాశాలను జెఎన్‌టియు యూనివర్శిటీగా ఏర్పాటు చేయడం వలన ఈ జిల్లాలో ఉన్నటువంటి గిరిజన విద్యార్థులకు మరిత విద్య అవకాశాలు ఉంటాయన్నారు. జెఎన్‌టియు కళాశాలకు ఏర్పాటుకు కావాల్సిన వసతులు అన్నీ కూడా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జెఎన్‌టియు యూనివర్శిటీ ఏర్పాటుకు దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఫహీం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హరీష్, ఆఫీస్ బేరర్స్, అజిత్, వంశీ, షాహిద్, పవన్‌సాయి, జిల్లా నాయకులు రణధీర్, రాజు, శిరీష, సింధు, అను, నవ్య పాల్గొన్నారు.

# పెట్రోల్ బంక్‌ను సద్వినియోగం చేసుకోవాలి




**జిల్లా కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెంః** వాహనదారులు పెట్రోల్ బంక్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం తిరుమలాయపాలెం మండలంలోని కొక్కిరేణి రెవిన్యూ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన బంక్‌ను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానాతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తొలుత వేద పండితుల వేదమంత్రాల మధ్య పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అదునాతన సాంకేతికత,హంగులతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ స్వచ్ఛమైన పెట్రోల్,డిజిల్‌ను వినియోగదారులకు అందించి వారి మన్నలను బంక్ చురుగొనాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ప్రసాద్‌రెడ్డిని బంక్ నిర్వాహకులు మహమ్మద్ హుస్సేన్,కుటుంబ సభ్యులు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పాలేరు డివిజన్ నాయకులు చావా శివరామకృష్ణ, రామసహాయం నరేష్‌రెడ్డి, ఎంపీపీ మంగీలాల్‌నాయక్,మాస్‌లైన్ జిల్లా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, మండల నాయకులు పుసులూరి రమేష్‌బాబు,ఉన్నాం రాజశేఖర్, పోట్ల కిరణ్, తాటికొండ కిరణ్, గోళ్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మండల పంచాయితీ అధికారి బి శ్రీనివాస్ అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఐసోలేషన్ గ్రామాలైన నడిమిగూడెం, రాఘవపురం, బండారుగూడెం, రాఘవపురం, బూసరాయి గ్రామాలను ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా ఆయా గ్రామాల్లోని ప్రధానంగా నీటి ఎద్దడి, తదితర సమస్యల నివారణకు తీసుకోవాలసిన జాగ్రత్తల గురించి ఆయన ఆయా పంచాయితీల కార్యదర్శులను, గ్రామ పంచాయితీ సిబ్బందిని వెంట పెట్టుకొని సందర్శించారు. మండల కేంద్రానికి సుమారు 35 కిలో మీటర్ల దూరంలో దట్టమైన అడవులు మధ్యలో ఉన్న అత్యంత మారుమూల ప్రాంతమైన బూసరాయి గ్రామానికి మండుటెండను సైతం లెక్క చేయకుండా ద్విచక్ర వాహనంపై వెళ్ళి గ్రామంలోని గొత్తికోయల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పరిధిలో మొత్తం 38 గృహాలలో 170 మంది గొత్తికోయలు ఉంటున్నారని వీరిలో 62 మంది ఓటర్లు 55 మంది పిల్లలు ఉన్నారని, ఈ బూసరాయి గ్రామంలో ప్రజలు సుమారు 20 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్నట్లు తెలిపారు. అంతే కాకుండా వీరిలో అందరికీ రేషన్ కార్డు లేవని ఆధార్ కార్డులు కొందరికి మాత్రమే ఉన్నాయని గుర్తించడం జరిగిందన్నారు. ఈ గ్రామంలో ప్రజల తమ అవసరాలకు కొద్ది దూరంలో రెండు బావులు, ఒక చిన్న ఊర చెలిమి ద్వారా నీటిని సేకరిస్తున్నారని, ఒక చేతి పంపు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారని, రహదారి సౌకర్యం లేనందున బోర్ వెల్ వాహనం రాలేదని, గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించుటకు అటవీ శాఖ అనుమతులు అవసరమని, ఆదే మా పరిధిలో లేదని తెలియపరచడం జరిగిందన్నారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రం ఒక ఆశా వర్కర్ ఏర్పాటుకు, అలాగే గ్రామ ప్రజలు ఎదుర్కొంటువంటి ప్రధాన సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు నివేదికలు అందజేస్తామని తెలిపారు. గ్రామ పంచాయితీ నుండి కావలసిన సహాయ సహకారాలు అన్ని అందజేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## తుంబూరు దయాకర్‌రెడ్డి పర్యటన



**ప్రజాపక్షం/కారేపల్లిః** తెలంగాణ రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి మండలంలో గురువారం పర్యటించారు. పర్యటనలో భాగంగా సింగరేణి మండలం పేరుపల్లిలో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పట్టు వస్త్రాలను కానుకగా అందజేశారు. ఆ మండలం అనంతారం గ్రామంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బండారి నగేష్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఇమ్మిడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, రైతుబంధు మాజీ మండలాధ్యక్షులు గుగులోతు శ్రీను, మాజీ ఎంపిపి భాను, దేవ్లానాయక్, భాగ్యనగర్ తండా, ఎంపిటిసి ఆలోత్ ఈశ్వరి, నందరాజు జరపల ధోని, తొగర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల్లో సౌకర్యాలు కల్పించాలి



**ప్రజాపక్షం/కారేపల్లిః** కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనులను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బృందం పర్యటించి పని ప్రదేశాల్లో సౌకర్యాల గురించి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విపరీతమైన ఎండలు ఉన్న దృష్టిలో ఉంచుకొని పని ప్రదేశం లో టెంట్లు, మంచినీటి సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేసి ప్రతిఒక్కరికి 200 పనిదినాలు కల్పించాలన్నారు. కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలి చెల్లించాలన్నారు.

## కోట్యా నాయక్ మృతి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని మంగాపురంతండా కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు భూక్యా కోట్యానాయక్ (70) గురువారం మృతి చెందాడు. మృతదేహం ను కిసాన్ సెల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మొక్క శేఖర్‌గౌడ్ సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...కాంగ్రెస్ బలోపేతం కు శక్తి వంచన లేకుండా కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన లేని లోటు కాంగ్రెస్ కు తీరదన్నారు. మృతుడు కుమారుడు కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు భూక్యా చిన్నానాయక్ ను ఓదార్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు అంజిని, బచ్చలకూరి నాగరాజు, మార్తి కోటి, బొందయ్య, బోయిన వేణు, యాతాకుల శ్రీనాథ్, సూరేపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

## తిరువూరు సమీక్షలో సీఐ, తహసీల్దార్

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఆంధ్రప్రదేశ్ లోని తిరువూరు లో అంతరాష్ట్ర చెక్‌పోస్టు లపై గురువారం సమీక్ష సమావేశం ను నిర్వహించారు. ఈ సమీక్ష కు జిల్లా సరిహద్దు గ్రామమైన అప్పల నరసింహాపురం లో ఉన్న అంతరాష్ట్ర చెక్‌పోస్టు నుంచి నేలకొండపల్లి ఎక్సైజ్ సర్కిల్ సీఐ కె.జగన్నాథరావు, నేలకొండపల్లి తహశీల్దార్ గౌరీశంకర్, మండల రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ఆలస్యం మధుసూధన్‌రావు లు పాల్గొన్నారు. చెక్‌పోస్టు ల వారీగా సమీక్ష నిర్వహించారు. తనీఖీలు,భద్రతా, సౌకర్యాలు సిబ్బంది, ఇతరత్రాత వివరాలను అడిగి తెలుసుకున్నారు. చెక్‌పోస్టు వద్ద నిరంతరం తనీఖీలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. మద్యం, మాదక ద్రవ్యాలు, నగదు ఎట్టి పరిస్థితులో చెక్‌పోస్టు దాటొద్దని ఆదేశించారు. గ్రామాలలో బెల్ట్‌షాపులలో విక్రయాలు జరగకుండా చూడాలని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికార యంత్రాంగం చూడాల్సిన బాధ్యత అధికారుల పై ఉందని ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

## జిల్లాలో శిశు మరణాలు అరికట్టాలి




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో శిశు మరణాలు సంభవించి కుండా అరికట్టాలని జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా అన్నారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో శిశు మరణాల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 05 సం.లోపు శిశువుల మరణాల వివరాలు అడిగి తెలుసుని వాటి నివారణకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శిశు మరణాల నివావరణకు ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్యాధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చిన్న పిల్లలకు ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే దగ్గర్లోని ఆస్పత్రులకు తీసుకెళ్లాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులు ఉండాలని, చిన్నారుల మరణాలు సంభవించకుండా వైద్యం అందించాలని వైద్య విధాన పరిషత్ సిహెచ్ఓ రామవరం వైద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా.శిరీష, డిప్యుటీ డిఎం హెచ్ఓ డా. సుకృత, డా.బాలాజీ నాయక్, డా.నర్సింహారావు, డా. వీరబాబు, డా.పుష్పలత, భద్రాచలం, పాల్వంచ సూపరింటెండెంట్‌లు, పిహెచ్‌సిల వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# 434 గజాలు భూమి ఎక్కడ నుండి వచ్చింది..?

**-275.55 ఉంటే 709.5 ఎలా అయింది**
**-నోటీసులు జారీ చేస్తాం: తహశీల్దార్ శ్రీనివాసరావు**
**-98 సర్వే నెంబర్ గుట్ట ఆక్రమణపై విచారణ వేగవంతం**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో ఉన్న సర్వే నెంబర్ 98లోని ప్రభుత్వ గుట్ట ఆక్రమణపై వైరా తహశీల్దార్ శ్రీనివాసరావు విచారణ ప్రారంభించారు. ఇంటి యజమాని సంబంధిత డాక్యుమెంట్లు తీసుకొని తహశీల్దార్ కార్యాలయంకు రావాలని ఆదేశించారు. అదేవిధంగా 275.55 గజాలు ఉన్న భూమి 709.55 గజాలు ఎలా అయిందని, దానికి సంబంధించిన డాక్యుమెంట్లు తీసుకురావాలని ఆదేశించారు. అసలు ఆ 434 గజాలు భూమి ఏ విధంగా రిజిస్ట్రేషన్ చేశారని, ఆ భూమి ఎక్కడ నుండి ఏ విధంగా వచ్చిందని, ప్రతి విషయాన్ని డాక్యుమెంట్ రూపంలో చూపించాలని తెలిపారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వ భూములు ఆక్రమణపై సీరియస్‌గా ఉందని ప్రభుత్వ భూముల ఆక్రమించుకున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. అసలు మొదటి డాక్యుమెంట్‌లో 275.55 గజాలు ఉంటే రెండో డాక్యుమెంట్‌లో 709.55 గజాలు ఏ విధంగా వచ్చిందని రెవెన్యూ అధికారులు విచారణ ప్రారంభించారు. గుట్ట రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వారికి నోటీసులు జారీ చేస్తాం. జిల్లా అధికారులు ఆదేశాల మేరకు తప్పుడు రిజిస్ట్రేషన్‌కు కారకులైన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటాం అని తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

# ఏజెన్సీలో పోడు వివాదాలు సద్దు మనిగేనా..?



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతంలో పోడు గొడవులు సద్దు మనిగేలా కనిపించడం లేదు. ఇటీవల మండలంలో జరిగిన ఓ సంఘటనే దీనికి నిదర్శనంగా కనిపిస్తుంది. అయితే బగ్గపాడు ఘటనలో పోలీస్ సిబ్బందిపై దాడి మరువక ముందే ములకలపల్లి మండలంలోని ధర్మన నగర్ గ్రామంలో ఫారెస్ట్ గార్డుగా పని విధులను నిర్వహిస్తున్న పూర పై గురువారం మధ్యాహ్నం వలస ఆదివాసీలు దాడి చేశారు. ఈవిషయంపై ఫారెస్ట్ రేంజర్ రవికిరణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మననగర్ అటవీ పరిధిలో పోడు భూముల్లో ట్రాక్టర్ ద్వారా చెరువు కట్టలు పోస్తున్నట్లు సమాచారం మేరకు గార్డ్‌గా విధులను నిర్వహిస్తున్న పూర ఆ ప్రాంతానికి వెళ్లడం జరిగిందని, అక్కడే ఉన్న పోడు సాగు దారుడు చుక్కయ్యతో తన చేతిలో ఉన్న పారతో గార్డు తలపై రెండు సార్లు దాడి చేయడంతో గార్డు తీవ్రంగా గాయపడ్డటం జరిగిందన్నారు. ఈవిషయం తెలుసుకున్న సంఘటన స్థలానికి తన సిబ్బందితో చేరుకుని, గాయాలపాలైన గార్డును చికిత్స నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ఈవిషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# రైతు నేస్తం సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/ బోనకల్ :** రైతు నేస్తం పేరిట ప్రతి మంగళవారం నిర్వహించే వీడియో కాన్ఫిరెన్స్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారులు సూచించారు. గురువారం బోనకల్ మండల పరిధిలోని రావినూతల, ముష్టికుంట్ల, బోనకల్ రైతు వేదిక నందు ప్రతి మంగళవారం రైతు నేస్తం పేరిట నిర్వహించే వీడియో కాన్ఫిరెన్స్ సేవలపై క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు రైతులకు క్షేత్రస్థాయిలో వివిధ పంటలలో ఎదుర్కొనే సమస్యలపై ముఖాముఖిగా చర్చిస్తారని తెలిపారు. డిజిటల్ సేవల్లో భాగంగా శాస్త్రవేత్తలు,నిపుణులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని చెప్పారు. క్షేత్రస్థాయిలో రైతులకు వివిధ పంటల యాజమన్యం, చీడపీడల నివారణ, సమగ్ర పోషక యాజమాన్యం, నీటి యాజమన్యం, కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాతావరణ పరిస్థితులు తదితర విషయాలపై రైతులకు నేరుగా అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ధరగాణి కళ్యాణి, మరీదు త్రివేణి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



# వంగవీడులో హెల్త్ క్యాంపు

**ప్రజాపక్షం/ మధిర :** మాటూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వీరబాబు ఆధ్వర్యంలో వంగవీడు గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. బిపి షుగర్, జ్వరాలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అవసరమైన వారికి సిబిపి, ప్లేట్లెట్స్, టైఫాయిడ్, డెంగ్యూ పరీక్షల కోసం పిహెచ్‌సికి పంపించటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బ తగులకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి వడదెబ్బ, జ్వరాలు ఇతర రోగాలు బారిన పడిన వారిని గుర్తించి వైద్య సేలందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# రూ.1 కోటి 52 లక్షలకు ఐపి దాఖలు

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం పట్టణంలో రూ.1 కోటి 52 లక్షల కు ఐపి దాఖలు అయ్యింది. పట్టణానికి చెందిన వనమా సుబ్బారావు కొంతకాలంగా డిపార్ట్ మెంటల్ స్టోర్ నిర్వహిస్తున్నారు. వ్యాపారాభివృద్ధి కోసం ఆయన 46 మంది వద్ద నుండి రూ.1 కోటి 52 లక్షల వరకు అప్పులు తెచ్చారు. వడ్డీలు పెరిగిపోవడంతో వాటిని చెల్లించే పరిస్థితి లేదని కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జీ కోర్టులో బుధవారం ఐపి దాఖలు చేశారు. అప్పులు ఇచ్చిన వారిని ప్రతివాదులుగా పేర్కొన్నారు.

**పట్టణంలో పెరిగిపోతున్న ఐపిలు...**

భద్రాచలంలో పట్టణ ఈ మధ్య కాలంలో ఐపిలు క్రమంగా పెరిగిపోతున్నాయి. గత కొంత కాలంగా యూబి రోడ్‌కు చెందిన కిరిణా షాపు వ్యాపారి ఐపి దాఖలు చేశారు. అదే విధంగా పాతమార్కెట్‌లోని ఓ వ్యాపారి సైతం ఐపి పెట్టారు. ప్రస్తుతం మరో ఐపి దాఖలు కావడంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అప్పులు ఇచ్చిన వారు లబోదిబో మంటు మొత్తుకుంటున్నారు.

# సాగర్ నీటితో చెరువులు, కుంటలు నింపాలి

**-రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** నాగార్జున సాగర్ నీటితో ఖమ్మం జిల్లాలోని చెరువులు, కుంటలను నింపాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మంజిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో గ్రామీణ ప్రాంతాల్లో బావులు, బోర్లు ఎండి పోయాయని తీవ్రమైన నీటి కొరత ఏర్పడిందని ఆయన తెలిపారు. రానున్న కాలంలో సమస్య మరింత తీవ్రతరమయ్యే ప్రమాదం ఉందని వెంటనే సాగర్ నీటితో చెరువులు, కుంటలను నింపినట్లయితే భూగర్భ జల నీటి మట్టం పెరుగుతుందని తద్వారా నీటి కొరత నివారించ బడుతుందని రమేష్ తెలిపారు. పశువులు తాగేందుకు చుక్క నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పదేళ్లలో ఎండిపోని చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరుల్లో నీరు ఇంకి పోయిందని ఆయన తెలిపారు. రైతులు, గ్రామీణ ప్రాంత ప్రజల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగర్ నీటితో ఆయకట్టు పరిధిలోని చెరువులను నింపాలన్నారు. తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి తక్షణం అమలు చేయాలని నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక నిధులు ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం దీని పట్ల సానుకూలంగా వ్యవహరించాలని ఆయన కోరారు.

# రంజాన్ తోఫా పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని కొత్త మజీద్ ప్రాంగణం నందు పవిత్ర రంజాన్ ఈద్ ఉల్ ఫితర్ పర్వదినం సందర్భంగా ముస్లిం ఐక్యసంఘం ఆధ్వర్యంలో సుమారు 300మంది పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ముస్లింలందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ అధ్యక్షులు మౌలానా షేక్‌ముజాహీద్, మండల అధ్యక్షులు షేక్.మహబూబ్‌పాషా, గౌసుద్దీన్, జానిమియా, గాలిబ్, ఖాదర్, చాంద్ పాషా, దస్తగిరి, షాజహాన్, రఫీ, మౌలాలి, మదార్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/ బోనకల్ :** ప్రమాదవశాత్తు రైలుబండి తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంబోనకల్‌లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. బోనకల్ గ్రామానికి చెందిన బండి యాకోబు కుమారుడు బండి సురేష్ బుధవారం రాత్రి బోనకల్‌లోని రైల్వేలైన్ పట్టాలను ఫోన్ మాట్లాడుకుంటూ దాటుతుండగా అదే సమయంలో అతివేగంతో వస్తున్న శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదవశాత్తు బండి సురేష్‌కు తాకటంతో సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. శాతవాహన ఎక్స్‌ప్రెస్ ట్రైన్ డ్రైవర్ స్థానిక రైల్వే మాస్టర్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న రైల్వే సిబ్బంది మృతదేహాన్ని గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారాన్ని అందించారు. దీంతో సురేష్ కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. సురేష్ అకాల మృతి పట్ల స్నేహితులు, బంధువులు, బోనకల్ వాసులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు.

# నవోదయకు సెయింట్ మేరీస్ విద్యార్థులు



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల కేంద్రం బోనకల్‌లోని సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు నవోదయకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఫిలిప్, హెచ్‌ఎం సి.జోస్పిన్ తెలిపారు. పాఠశాలకు చెందిన నక్కా ప్రేమ్‌స్మిత, మాదుగు సాహిత్య నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఎంపికైయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారితో పాటు పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

# తొమ్మిది నుంచి నిత్యకళ్యాణాలు నిలిపివేత

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఈ నెల 9 నుండి 23వ తేది వరకు రామాలయంలో నిత్యకళ్యాణాలను నిలుపుదల చేస్తున్నట్లు దేవస్థానం ఇఓ ఎల్ రమాదేవి తెలిపారు. శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న సందర్భంగా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. 24వ తేది నుండి పునరుద్దరణ ఉంటుందన్నారు. దీనిని భక్తులు గమనించాలని సూచించారు.

# రామ గాయత్రి ఆలయాన్ని సందర్శించిన ఎంఎల్‌ఏ తెల్లం



**ప్రజాపక్షం/భద్రాచలం :** పట్టణంలోని రామగాయత్రి ఆలయాన్ని గురువారం డా.తెల్లం వెంకట్రావు సందర్శించారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, గాయత్రి ఉపాసకులు ఎం రామబ్రహ్మచారి ఎంఎల్‌ఏను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.